క్లుప్తంగా

నేడు సచివాలయ సిబ్బందితో సమావేశం

కొయ్యూరు: సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వచ్చే వారంతా విధిగా వివిధ రికార్డులను తీసుకురావాలని, ఎవరూ సెలవు పెట్టవద్దని సూచించారు.

28న మండల సమావేశం

చింతపల్లిరూరల్: మండలంలో 28న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వీరసాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సిల్వర్‌ఓక్ మొక్కల పంపిణీ



బారమసిలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీవో లింగమూర్తి సిబ్బంది

హుకుంపేట: మండలంలోని బారమసి పంచాయతీలోని నీలంపుట్టు, బారపల్లి గ్రామాల గిరిజనులకు సిల్వర్‌ఓక్ మొక్కలను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో లింగమూర్తి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిల్వర్ మొక్కల పెంపకంతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీలోని 43 ఎకరాల్లో సాగు చేసేందుకు మొక్కలు అందించేందుకు ప్రతిపాదనలు పంపించామని, మొదటి విడతలో 12 ఎకరాలకు సిల్వర్‌ఓక్ మొక్కలు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఈసీ శంకరరావు, సర్పంచ్ రమాదేవి, సిబ్బంది అర్జున్, రామస్వామి, రాంబాబు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



భోజనాలు వడ్డిస్తున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ లోకేష్‌కుమార్, కానిస్టేబుళ్లు

కొయ్యూరు: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గురువారం సింగవరం షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద భారీ అన్నసమారాధనను కొయ్యూరు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మూర్తి ఏర్పాటు చేశారు. వాస్తవంగా ఆదివారం చేయాల్సిన అన్నసమారాధన వర్షం కారణంగా చేయలేకపోవడంతో గురువారం చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు సాయిబాబా ఆలయంలో సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్, కానిస్టేబుల్ మూర్తి, స్థానిక పోలీసులతో కలిసి భక్తులకు భోజనాలు వడ్డించారు. ముందుగానే అన్ని ప్రాంతాల్లో అన్న సమారాధనపై ప్రచారం చేయడంతో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాస్

చింతపల్లిరూరల్: సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని చింతపల్లి వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలో పెదబరడ గ్రామంలో పోలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులు మండలంలోని లంబసింగి ట్రైబల్ ప్రాడక్ట్స్ (ఎఫ్‌పీవో) సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 వారాల పాటు పోలంబడి కార్యక్రమం అన్ని గ్రామాల్లో నిర్వహించాలని ఇందులో భాగంగా రైతులకు సాంకేతిక, సేంద్రియ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలని ఎఫ్‌పీవో సిబ్బందికి తెలిపారు. అనంతరం రాగి నారుమడిని పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సాగునీటి నమూనాలను సేకరించి నీటి పరీక్షలు కోసం ల్యాబ్‌కు పంపినట్టు చెప్పారు.

బిక్కుబిక్కుమంటూ ప్రయాణం



అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ సమీపంలోని బురదతో చిత్తడిగా రహదారి



ఘాట్‌రోడ్డులో పేరుకుపోయిన బురద

- ఘాట్‌రోడ్డులో జారిపడుతున్న కొండచరియలు
- వర్షాలతో రోడ్డంతా బురదమయం
- పెరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో స్థానికులు, వాహనచోదకులు
- పట్టించుకోని జాతీయ హైవే అధికారులు

అనంతగిరి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండలంలోని అరకు–విశాఖ ప్రధాన రహదారి ప్రమాదభరితంగా మారింది. కొండవాలు ప్రాంతం నుంచి కొండచరియలు, మట్టి పెళ్లలు రహదారిపైకి కొట్టుకువచ్చి, ప్రమాదభరితంగా మారాయి. ఈ మార్గంలోని ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు.. ఎన్‌హెచ్5 శాఖాధికారుల నిర్లక్ష్యానికి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి.. వర్షాలకు మట్టికొట్టుకువచ్చి ఘాట్ రోడ్డు బురదమయంగా మారుతుంది. ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాలను ఊహించలేని పరిస్థితి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు నెలలో అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ సమీపంలోని బరజోల రోడ్డు నుంచి మట్టిదిబ్బలు, కొండచరియలు జారిపడడంతో సుమారు మూడు అడుగుల ఎత్తులోని బురద నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో గంటలకొద్దీ వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఇదే విధంగా 2018 కాశీపట్నం సమీపంలోని బంగారమ్మపేట వద్ద కొండవాలు ప్రాంతం నుంచి మట్టిదిబ్బలు జారిపడడంతో బురదమయంగా మారి, ఓ యువకుడు ఎస్.కోట వైపు వెళ్తూ ప్రమాదానికి గురై ఘటనస్థలంలోనే మృత్యువాతపడ్డాడు.

చిత్తడిగా దారులు

మండలంలోని ఘాట్‌రోడ్డులో పలుచోట్ల వర్షాకాలంలోని ప్రమాదభరితంగా మారాయి. ఇందులో భాగంగా అనంతగిరి సమీపంలోని కాఫీ ప్లాంటేషన్ బరజోల వద్ద, డముడు హెయిర్‌పిన్ బెండ్–5 వద్ద తరచూ కొండచరియలు, మట్టి కొండపై నుంచి జారిపడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటు అనంతగిరి–అరకు ఘాట్ రోడ్డులో చాలా చోట్ల రక్షణ గోడలు లేవు..కొన్ని చోట్ల శిథిలావస్థలో ఉన్నాయని వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన ఘాట్‌రోడ్డు మరమ్మతుకు హైవే ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ ఘాట్ రోడ్డు సమస్యను జాతీయ హైవే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లు



వర్షాల కారణంగా కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ పూర్ణిమ, రెవెన్యూ సిబ్బంది



తాడివీధి గ్రామంలో వర్షానికి కూలిన ఇంటి గోడ

హుకుంపేట: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని కాసుల రవణమ్మ అనే మహిళ ఇల్లు గురువారం కూలింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, వీఆర్‌వో కొండబాబు వచ్చి కూలిన ఇంటిని పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు. తుపాను బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

కూలిన ఇంటి గోడ

జి.మాడుగుల: మండలంలో కురుస్తున్న వర్షాలకు భీరం పంచాయతీ తాడివీధి గ్రామంలో ఓ ఇంటి గోడ కూలింది. తాడివీధి గ్రామానికి చెందిన తల్లాబు రాజయ్యకు చెందిన రేకు ఇల్లు తాలుకా వెనుక భాగం గోడ వర్షానికి నేలమట్టమైంది. రాజయ్యతో పాటు అతని భార్య సుహాసిని, ఇద్దరు పిల్లలు నివాసముంటున్నారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్నవారికి ఎవరికీ ఏమీకాలేదు. ప్రాణాపాయం తప్పింది. దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఇంటి గోడ కూలడంతో కుటుంబం నిరాశ్రయులయ్యారు. తగిన నష్టపరిహారం అందించి పక్కా ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రాజయ్య కోరారు.

గంగవరం : కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులు, గుంతలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నయిని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మొల్లేరు సొసైటీ మాజీ డైరెక్టర్ పండా సిద్ధార్థ దొర విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చాలా మంది వాగులు, చెరువుల వద్దకు చేపల వేటలకు వెళ్లి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఇది చాలా బాధాకరమని ఆయన అన్నారు. మంచి నీటి ని కాచి చల్లార్చిని నీళ్ల తాగాలని, దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో శుభ్రం ఉంచుకోవాలని సూచించారు. ఈ వర్షాలు కారణంగా మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలు సోకి తీవ్ర అనారోగ్యానికి గురిచేసింది కాబట్టి అందరూ తాగు జాగ్రతలు తీసుకోవాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

గంగవరం : కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మొల్లేరు సొసైటీ మాజీ డైరెక్టర్ పండా సిద్ధార్థ దొర గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లొద్దని, చేపట వేట వంటి చేపట్టొదని సూచించారు. సీజనల్ వ్యాధులతో జాగ్రత్త ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఆహారం తీసుకోవద్దన్నారు. అనారోగ్యమైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు.

పొంగిన వాగులు.. తప్పని వెతలు



వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న తోకవలస గెడ్డ

అరకులోయ రూరల్: జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇందులో భాగంగా అరకులోయ మండలంలోని శిర్గం పంచాయతీ ఎస్.తోకవలస గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. గ్రామ సమీపంలోని ఉన్న తోకవలస గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోండడంతో సమీపంలో ఉన్న సుమారు ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పాటు సమీపంలోని కోడిపుంజువలస గ్రామ సమీపంలో స్థానికులు తాత్కాలికంగా నిర్మించుకున్న రహదారి భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, యంత్రాంగం స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

- గ్రామాల్లో ఐటీడీఏ పీవో అభిషేక్ పర్యటన
- వరద బాధితులకు తక్షణ సాయానికి భరోసా



ఇళ్లు కూలిన బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పీవో అభిషేక్

పెదబయలు: మండలంలో పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు గ్రామాన్ని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గురువారం సందర్శించారు. హోరువానలో ఆయన గ్రామాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కిముడుపల్లిని సందర్శించారు. గ్రామంలో ని డీఆర్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన కె.సుమిత్ర, ఎస్.లింగమ్మకు చెందిన పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం వారికి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులను అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు నష్టపరిహారం అందించాలని తహసీల్దార్ జి.రంగారావును ఆదేశించారు. బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు సరఫరా చేయాలని ఎంపీడీవో విగ్గిస్‌కు ఆదేశించారు.

ఆయన వెంట కిముడుపల్లి, పెదకోడాపల్లి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయాల సిబ్బంది ఉన్నారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

యువకుడి కోసం కొనసాగుతున్న గాలింపు



జయవర్ధన్ (ఫైల్)

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెంకు చెందిన రీమెల జయవర్ధన్ అదృశ్యమై నాలుగు రోజులు కావస్తున్నా నేటి వరకు ఆచూకీ తెలియలేదు. ఈనెల 21న కత్తిరాలలొద్ది వెళ్తూ యువకుడు అదృశ్యమైన విషయం తెలిసిందే. గ్రామ సమీపంలోని గెడ్డలో కొట్టుకుపోయి ఉంటారన్న అనుమానంతో మొత్తం తీగలమెట్ట కాలువ వెంబడి వెతికారు. గాదేగుమ్మి జలపాతం వద్ద కూడా గురువారం గజఈతగాళ్లు గాలించారు. అయినా జయవర్ధన్ దొరక లేదు. ఈ కాలువ తాండవకు ప్రధాన ఇన్‌ఫ్లోగా ఉంది. దీంతో కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ అదృశ్యమైన జయవర్ధన్ కోసం అన్ని ప్రాంతాల్లోను గాలింపు చర్యలు చేపడుతున్నామనానరు. జయవర్ధన్ కాలువలో కొట్టుకుపోయి ఉంటారన్న అనుమానాన్ని అతని కుటుంబసభ్యులు, బంధువులు వ్యక్తం చేయడంతో దీనిపై కూడా ఆరా తీస్తున్నామన్నారు.

విద్యుత్ వైర్లపై పడిన చెట్టు

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- నిలిచిన విద్యుత్ సరఫరా



విద్యుత్‌తీగలను సరిచేస్తున్న సిబ్బంది

సీలేరు: సీలేరు జెన్‌కో కాలనీలో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులకు భారీ చెట్టు నెలకొరిగింది. అయితే ఈ చెట్టు విద్యుత్ వైర్లు మీద పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఈ చెట్టు విద్యుత్ తీగల మీద కాకుండా సమీప గృహాల మీద పడి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని కాలనీ వాసులు చెప్పారు. త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. సంఘటన విషయం తెలిసిన వెంటనే డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి విద్యుత్ తీగలను సరిచేసే ప్రయత్నం చేశారు. ఏడీఈ అప్పారావు, ఇన్‌చార్జి ఏఈ నాగేశ్వరరావు, ఫోర్‌మెన్‌లు లామా, ఓబీ, డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది మూడు గంటలు శ్రమించి విద్యుత్తు లైన్‌లను సరిచేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు



విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది



విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఏఈ సత్యనారాయణ తదితరులు

అరకులోయ రూరల్: నియోజకవర్గంలోని డుంబ్రిగుడ, అనంతగిరి మండలాలకు చెందిన వివిధ ప్రాంతాలకు వెళ్లే విద్యుత్ లైన్‌లు గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు గత రెండు రోజులుగా తమ సిబ్బంది విస్తృతంగా మరమ్మతు పనులు చేపడుతున్నట్టు ఏఈ సత్యనారాయణ చెప్పారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు పలుచోట్ల విరిగిపడ్డాయని, చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. భారీవర్షంలోనే సిబ్బంది సహకారంతోనే పలు ప్రాంతాల్లో చెట్లు తొలగించామన్నారు, ఇప్పటివరకు అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా సహాయ చర్యలు తీసుకున్నామన్నారు. వర్షాల కారణంగా గ్రామల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు అందరూ దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏడీ, సిబ్బంది అభి, కృష్ణ, గోవర్ధన్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మద్దులబందలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

జి.మాడుగుల: తుపాను బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ మద్దులబంద గ్రామంలో తుపాను బాధిత రైతుల వ్యవసాయ భూములను పార్టీ ప్రతినిధి బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దులబంద గ్రామంలో 20 ఎకరాల్లో తుపాను ప్రభావానికి పంట నష్టం జరిగిందన్నారు. వరినాట్లు వరదలకు కొట్టుకుపోయాయని, మరి కొన్ని పొలాల్లో ఇసుకమేటలు పేరుకుపోయాయని చెప్పారు. తుపాను ప్రభావితం ఉన్న గ్రామాల్లో కనీసం అధికార యంత్రాంగం పర్యటించలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని తమ పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేస్తుందన్నారు. పోలవరం ముంపు ప్రాంతాలతో పాటు జిల్లా పరిధిలో వరద ఉధృతి వల భూమి నష్టం, ఇళ్లు, కల్వర్టులు, వంతెలను నష్టాలను తెలియజేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 5వేల ఎకరాల్లో పంటల రైతులు నష్టపోయారని ఆయన చెప్పారు. పార్టీ కార్యదర్శి ధర్మన్నపడాల్, నాయకులు చిన్నారావు, వరహాలబాబు, వీరన్నపడాల్ తదితరలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



ఢీంగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న సర్పంచ్ పాండురంగస్వామి

ముంచంగిపుట్టు: గ్రామాల్లో గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నారు.మండలంలో గల దారెల పంచాయతీ ఢీంగూడ, వరండపుట్టు గ్రామాల్లో సర్పంచ్ పాండురంగస్వామి గురువారం పర్యటించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని, నాటు మందులు, వైద్యం జోలికి పోద్దని సూచించారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు వినియోగించాలని సూచించారు. అనంతరం వరండపుట్టులో ఇంటిపై చెట్టు పడడంతో నిరాశ్రయులైన బాధితుడు కె.నీలంబరం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

పంచాయతీ కార్యదర్శి అర్జయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గిరీష్, వీఆర్‌వో శ్రీనువాసు, ఎంఎల్‌హెచ్‌పీ తులసి, ఏఎన్ఎంలు రాజేశ్వరి, కాంతమ్మ తదితరులున్నారు.

ముక్కుమూసుకోవాల్సిందే...

- అధ్వానంగా మార్కెట్ యార్డు పరిసరాలు
- రోజుల తరబడి పేరుకుపోయిన చెత్త
- కొనుగోలుదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు





అరకులోయలని మార్కెట్ యార్డులోని పలుచోట్ల పేరుకుపోయిన చెత్త కుప్పలు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో యార్డు ప్రాంతం అంతా అధ్వానంగా మారింది. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గంధంతో ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో కూరగాయలు, ఇతరత్రా వ్యర్థాలు, పరిసర ప్రాంతాల్లోని చెత్తను కూడా యార్డులోని పలుచోట్ల కుప్పలుగా వేస్తున్నారని పలువురు చెబుతున్నారు. తీవ్ర దుర్గంధంతో మార్కెట్‌లో రాలేని పరిస్థితి ఉందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పేరుకపోయిన చెత్త వల్ల యార్డు పరిసరాలు మరింత దుర్భరంగా మారాయని చెబుతున్నారు. దోమలు, ఈగలతో పాటు కీటకాలు పేరుకుపోయాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్ సమస్యను పంచాయతీ ఈవో రాజ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై ఈవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపారులు చెత్తను మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కుండీల్లో వేసేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

బాలల పురస్కారానికి దరఖాస్తు గడువు పొడిగింపు

విశాఖ విద్య: జాతీయ బాలల పురస్కారానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు ఇలా ఏ రంగంలో అయినా ప్రావీణ్యాన్ని చాటుకుంటున్న 5–18 ఏళ్ల వయసు గల వారు బాలల అవార్డు దక్కించుకోవచ్చన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలతో https://awards.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల బాలల ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, దీనిపై పాఠశాలల స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు సూచించారు.

పశు వ్యాధులపై అప్రమత్తం



మేకలకు వైద్యం చేస్తున్న పశుసంవర్థక సహాయకురాలు అనుష్క

సీలేరు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పాడి పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సీలేరు సచివాలయ పశు సంవర్ధక సహాయకురాలు అనుష్క చెప్పారు. తుపాను కారణంగా గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయని ఈ సమయంలో పాడి పశువులకు వ్యాధులు సోకే ప్రమాదముందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత ఎక్కువై పశువులు మరణించే అవకాముందన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే వెంటనే సచివాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు.